


# గెలిచిన దెవరు?

కథానిక

పినతల్లి కూతురు రాధ పెళ్ళికి పల్లెటూరొచ్చిన ఇందిరకి ఒక్కక్షణం తోచడంలేదు. వచ్చిన మరుక్షణంనుంచి ఆమెకావూళ్లో మాట్లాడేవాళ్లు లేకపోవడం మూలాన పిచ్చెక్కినట్లయింది. పైగా మూడురోజు లుండాలి. పెళ్ళికి వచ్చినవాళ్ళంతా ఎవరో కొత్తవాళ్ళుగా కనిపించారు యిద్దరుముగ్గురు తప్ప. చదువుకున్న ఆడవాళ్ళు అసలులేరు. ఫోర్తు ఫారం చదువుకునే ఆడపిల్లలు మాత్రం యిద్దరు తటస్థపడ్డారు చుట్టాల్లో. వాళ్ళతోనే మొదటిరోజు కాస్సేపు కాలక్షేపం చేసింది. ఆపిల్లలతో తాను మెడ్రాసులో ఇంటర్ చదువుతూన్న కాలేజీ గొప్పతనం, అక్కడ సిటీబస్సులు సినిమాహాల్సులో పాటించబడే గౌరవ మర్యాదలు, పరిమితినిమించి టిక్కెట్లు యివ్వక పోవడం, బీచి, అడయ్యార్, జూ, మ్యూజియం, మొదలైనవాటి గురించి అంతులేకుండా లెక్చరిచ్చింది. ఆ పిల్లలిద్దరూ ఎప్పుడు మెడ్రాసువెళ్ళి పడదామా అని అనుకునేట్లు చేసింది.

సాయంత్రం చెరువుగట్టుకి షికారు కెళ్ళింది. చుట్టూరా పొలాలు. మధ్యమధ్య అక్కడక్కడ తారివెంబడి తుమ్మచెట్లు, తాటితోపులు. ఊరు మాత్రం చూడటానికెంతో ఆకర్షణీయంగా కన్పించింది. కాని మనుషుల్నిచూస్తే మాత్రం అసహ్యం వేసింది. చీకటిపడేవేళ తిరిగి ఇంటికి బయలుదేరింది.

దారిలో ఒకగేదె అరుస్తూ పరుగెత్తుకొస్తోంది. వెనకాల ఎవరో దానిని పట్టుకోవడానికి పరుగెత్తుకొస్తున్నారు తాడుచేత్తో పచ్చుకుని. గేదెమరీ దగ్గర కొచ్చింది.

"కొంచెం దానికడ్డులెండి. పొడుస్తుంది" కేక వినిసించింది.

ఇందిర పక్కకి తప్పుకొంది చటుక్కున. కాని గేదె దూకుడుమీద ఇందిర పమిటను రాచుకుంటూ పోయింది.

"కళ్లు కన్పించడంలేదూ... బ్లైండ్ ఫెలో... గేదెను మీదికి తోల్తావే" వెంటనే లేచి కోపంగా అంది. ఆ వ్యక్తి ఆమెను సమీపించాడు.

"పొరపాటండీ... నన్నే శానఅవత్తా పెడుతోంది." ఎంతో మర్యాదగా అన్నాడు.

గ్రుడ్డివెన్నెల వెలుగులో యిరువురూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"మీరా అండీ! పెళ్ళికొచ్చారుగదూ!" అని మళ్ళీ అన్నాడు.

"ఆఁ...మరే అడివిలోకొచ్చాం. నీకెందుకా ప్రశ్నలన్నీ-పో...పో." కసిరింది ఇందిర.

"చిత్తం...చిత్తం" కర్ర చంకలో పెట్టుకుని తలపాగా మళ్ళీ సర్దుకుని ఇందిరవైపే చూస్తూ నవ్వుకుంటూ అటునడుస్తూ పుట్టకాలికి తగిలి ముందుకు పడ్డాడు. ఇందిరా, మిగతా యిద్దరూ పకపక నవ్వారు.

"అబ్బా..." అంటూ లేచాడు వ్యక్తి.

ఇందిర ముందుకు సాగిపోతూ "అబ్బ...ఎలా వున్నాడామనిషి. భూతంలాగ ఆరు అడుగులఎత్తు,

ద్రోణంరాజు కృష్ణమోహన్

వాడూ...ఒత్తి బ్రూట్...గేదెను పట్టుకోలేని వాడు గేదెలని తోలుకోవడమెందుకు" అంది. ఆ మాటలు ఆ వ్యక్తికి వినబడినట్లు అనుమానించింది వెంటనే వెనుదిరిగి చూసి, 'వాడిమొహం... ఇంగ్లీషు ముక్కలు వాడికేం తెలిసి చస్తాయ్!' అనుకుని వెళ్ళిపోయింది.

మరునాడు వుదయం ఇందిర ఆ వీధి చివరవున్న రాఘవయ్యగారింటికి వెళ్ళింది మిగతా యిద్దరు పిల్లలతో.

"రండి అమ్మగారూ..." ప్రత్యక్షమైనాడు ఆ ఆరడుగులవ్యక్తి గేదెదగ్గిర గడ్డిబ్రోగుజేస్తూ. ఇందిర గుర్తించింది.

"రాత్రి గేదెను తోలినమనిషివి నువ్వేకాదూ?" ఇందిర ప్రశ్నించింది.

"చిత్తం...పొరపాటు. అప్పుడే చెప్పికొన్నా గదండీ" చిరునవ్వు నవ్వాడు. ఇందిర అప్రయత్నంగా నవ్వింది.

"నిజంగా ఆ వ్యక్తి ఎంత అందంగావున్నాడు! చాలాబలమైన శరీరం. విశాలమైన ఛాతీ. గాంభీరమైన కాఫీంగు. మనిషి పొడగరి. మెలికలు తిరిగిన నిగనిగలాడే కండలు. ఇంత అందమైవాడు. బలమైనవాడు, చదువుకున్నవాడైతే! తనతో పరిచయం వుండివుంటే! ఇందిర మనస్సులో ఏన్నో భావాలు ప్రవేశించాయి అకస్మాత్తుగా. వెంటనే తెప్పరిల్లి "నువ్వు వాళ్ళ ఇంట్లో పాలేరువా?" అడిగింది.

"మరేనండి. లోనకెళ్ళండి! అమ్మగారున్నారా కారింబోడ్డు ఆడండి అమ్మగారితో. శాన బాగా ఆడతారు మా అమ్మగారు" లోపలికి దారిచూపించాడు.

రాఘవయ్యగారింట్లో ఆయనభార్య కనకమ్మతో కాసేపు క్యారమ్స్ ఆడింది. అక్కడనుంచి మైగదిలోకెళ్ళింది. ఏవోచాలా పుస్తకాలు కన్పించాయి. టేబుల్, కుర్చీ, రెండు చిన్నబీరువాలు. ఒక మంచం వున్నాయి. బీరువాల్లో పుస్తగాలు కన్పించాయి. చాలా ఇంగ్లీషు పుస్తకాలు, హిందీ పుస్తకాలు కన్పింవాయి. 'సుధాకర్' అన్న పేరు బీరువాలమీద వ్రాసివుంది. తీసుకొందామనుకుంది ఏవైనా పుస్తకాలు కాని తాళం వేసివున్నాయి. అక్కడినుంచి కదలబుద్ధి కాలేదు.

"ఎవరివండీ యీ పుస్తకాలు" ఇందిర అడిగింది కనకమ్మను.

"మా అబ్బాయివి."

"ఏం చదువుతున్నారు?"

"బి. యస్. సి. మొన్న మార్చిలోనే ప్యాసై ఖాళీగానే వున్నాడు. ఉద్యోగంలేదు. ఏదీ ఇంటి పట్టునేవుంది పొలంవ్యవహారం చూడమంటున్నాం. వారికి కాస్త సహాయం. ఉద్యోగం దొరికితే పోలేనని గోలపెడుతున్నాడు. ఆయన వద్దంటున్నారు. పైగా పెద్దవారయ్యారు. చేతికింద కాస్త వాడుండకపోతే ఎలా?"

"ఇందిరక్కయ్యా...నిన్ను రమ్మంటున్నారు" ఒక కుర్రాడొచ్చి కిందనుంచి కేకేశాడు. వెంటనే ఆ సంభాషణ అంతటితో విరమించి చప్పున దిగి వచ్చింది.

పెళ్ళిఅయిపోయింది. మరునాడు ఇంకవుండనని ప్రయాణం కట్టింది ఇందిర.

"నువ్వు కూడా త్వరగా పెళ్ళి చేసుకోవే ఇందిరా" పినతల్లి అంది.

"అలాగే...ఒక మంచి అందమైన కుర్రాడిని ఎమ్. ఏ. ప్యాసయినవాడిని, బాగా డబ్బున్నవాడిని చూసిపెట్టు" కొంటెగా నవ్వుతూ సమాధానమిచ్చింది ఇందిర.

"బి. ఏ. యో లేకపోతే బి. ఎస్. సి యో చదివినవాడు పనికిరాడా?"

"ఎలాగైనా కొంచెం బాగా ఎక్కువ చదివి వుండాలి?

"సరిసరి. ఇంత చదువూ చదివి, ఇవేనా నీ భావాలు! నీకన్నా నీ మొగుడు ఎక్కువగా వుండాలీ? నువ్వు తక్కువదానివిలాగా వుండాలీ? పల్లెటూరి పిల్ల కోరుకున్నట్లు కోరుకున్నావేమో!" ఎగతాళిగా అంది ఇందిర పినతల్లి. ఇందిర సమాధానం చెప్పలేకపోయింది.

"అబ్బ! ఇంత తెలివిగలవాళ్లు మా పల్లెటూరి ఆడవాళ్లు! ఏమో అనుకున్నా!" అనిమాత్రం అనగలిగింది.

"మాటల కేమిలేగాని రాఘవయ్యగారి అబ్బాయిని చేసుకో చక్కగా."

"ఛ...ఛ...బి. యస్. సి. యేగా చదివింది"

"అయితే ఏం! పిల్లాడు ఎలా వుంటాడనుకున్నావ్! దబ్బపండులాగ వుంటాడు. చాలా అందగాడు. చదువుకున్న పిల్లనిగాని చేసుకోనని భీష్మించుకు కూర్చున్నాడు"

"ఆ అబ్బాయి సంగతి నాకు చెప్పక్కర్లేదు. నల్లగా పదడుగుల ఎత్తున రాత్రి కలలో కొచ్చేట్టు వుంటాడటగా?" మూతి తిప్పుకుంది.

"ఛ. ఎవరు చెప్పారు. చూద్దావుగాని పద."

"అక్కర్లేదు పిన్నీ... మొగుణ్ణి వెతుక్కోవడానికి రాలేదు నేనీవూరు నీ కూతురు పెళ్ళికొచ్చాగాని"

"నీ పొగరు బాగా అణచే మొగుడొస్తాడులే"

"చూద్దాం."

"చూద్దాం. ఇహ ఆరు నెలలేగా. పై చదువు ఎలాగా చదివించడులే మీ నాన్న."

* * *

ఇందిర ఇంటర్ ప్యాసైంది. తండ్రి ఇహపైనా సరే చదివించనని పట్టుపట్టాడు. పెళ్ళి చేసుకోకపోతే నూతిలో పడతానని ఇందిర తల్లిరాగాలెట్టింది. సంబంధాలు వెతికారు. నాలుగు నెలలలోనే సంబంధం కుదిరింది. కుర్రాడు గుంటూరులో కాలేజీలో ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు.

"సాయంత్రం చూడటానికి వస్తారు. చక్కగా డ్రస్ చేసుకో" అని మందలించాడు ఇందిర తండ్రి. ఇందిర కిష్టం లేకపోయినా తప్పలేదు.

వరుడు అతని, తల్లిదండ్రులు, మరోపెద్దమనిషీ వచ్చారు.

ఇందిర తలపైకెత్తి చూసింది. తనకళ్ళని ,తనే నమ్మలేకపోయింది! ఆ ఆరడుగులవ్యక్తి !ఆభూతం! ఆనాడు గుడ్డివెన్నెల్లో కన్పించిన భూతం! గేదెను మీదికి తోలిన బ్లైండ్ ఫెలో, బ్రూట్...వగైరా...వగైరా...కాని వరుడు సుధాకర్ ఏమాత్రం ఆశ్చర్యపడలేదు. అంతా ఇదివరకే తెలిసినట్లుగా నటించాడు.

"బ్లైండ్ ఫెలోని, పైగావట్టిబ్రూటేని, చేసుకున్నావేం?" రహస్యంగా కాగితంమీద వ్రాసి పంపించాడు. పెళ్ళి జరుగుతుండగా ఒక కుర్రాడి ద్వారా కాగితం తిరిగొచ్చింది. "అంతేకాదు... పచ్చి దొంగకూడాను... ఇంకా చెప్పాలంటే వొట్టి మోసగాడుకూడాను" అని మరోపంక్తులు వ్రాసివున్నాయి.

---

స్కెచ్

# స్వాములవారి చేతిచలువ

"పారిజాత"

అసలా వూళ్లో వెంకట్రామయ్య నెరుగని వారు లేనేలేరు. అతనంటే అందరికీ అదోవిధమైన "భావం" కలుగుతూండేది. వెంకట్రామయ్య ఒక స్వాముల వారిని చేరదీసేడంటే, మొదట్లో ఎవ్వరూ నమ్మలేక పోయేరు. కొంతకాలం వరకూ అది గోప్యంగానే గడిచిపోయింది. తరువాత పట్టణంలో ఊరేగింపులూ ఉపన్యాసాలూ, సభలూ, సన్మానాలూ జరిగేప్పటికి—"వెంకట్రామయ్యని మనం సరిగా అర్థంచేసుకోలేదురా"—అని అనుకొన్నవారి సంఖ్య వందలుదాటి వేలు చేరుకొంది. స్వాములవారు మాత్రం అలుకూ, కులుకూ, లేకండా వెంకట్రామయ్యనే అంటిపెట్టుకొని వుంటున్నారు.

స్వామివారి మహాత్తుగురించి ఆయన చేసిన ఘనమైన పనులుగూర్చి పలువురు పలువిధములుగా ప్రచారం చేయడం జరిగింది. ఒక పెద్ద బహిరంగ సభలో వెంకట్రామయ్యతోసహా పలువురు ఘరానా పెద్దమనుషులు ఎవరికి తోచిన విధంగా వారు